జ్వరపీడితులకు వైద్య సేవలు



తాడువాయిలో వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

- తాడువాయిలో రేపాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం
- చికిత్స పొందుతున్న 13 మంది

మునగాల : మండలంలోని తాడువాయి గ్రామంలో గత కొన్ని రోజులుగా పలువురు విషజ్వరాల బారిన పడడంతో శుక్రవారం సాక్షి దినపత్రికలో 'తాడువాయిని వణికిస్తున్న విషజ్వరాలు' అనే శీర్షికన వచ్చిన కథనానికి మండలంలోని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది స్పందించారు. శనివారం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైద్యాధికారి డా.శ్రీశైలం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరానికి గ్రామానికి చెందిన పలువురు జ్వరపీడితులు వచ్చి చికిత్స పొందుతున్నారు. శిబిరంలో పేరు నమోదు చేసుకున్న 64 మందిలో జ్వరంతో బాధపడేవారు 9 మంది ఉన్నట్లు వైద్యాధికారి డా.శ్రీశైలం తెలిపారు. 31 మందికి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించామని, 13 మందికి శిబిరంలో ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కిస్తున్నామని తెలిపారు. ముగ్గురిని సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు పేర్కొన్నారు. వైద్యశిబిరాన్ని ఆదివారం కూడా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు సహకరిస్తే వైద్యశిబిరాన్ని పొడిగిస్తామన్నారు. కాగా, గ్రామంలో జ్వరంతో బాధపడే వారు సుమారు 150 మంది పైచిలుకు ఉన్నారని సమాచారం. వీరిలో పలువురు ఇప్పటికే ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. వీరిలో డెంగీ, మలేరియా లక్షణాలతో బాధపడుతున్న వారు ఉన్నట్లు సమాచారం.



జ్వరపీడితునికి వైద్యం చేస్తున్న వైద్యాధికారి శ్రీశైలం

ముమ్మరంగా శానిటేషన్



వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి

మునగాల : మండలంలోని తాడువాయిలో పారిశుద్ధ్య లోపంతో విషజ్వరాలు ప్రబలుతుండడంపై శుక్రవారం సాక్షి దినపత్రికలో 'తాడువాయిని వణికిస్తున్న విషజ్వరాలు'అనే శీర్షికన వచ్చిన కథనానికి పంచాయతీ రాజ్ అధికారులు స్పందించి గ్రామంలో శానిటేషన్ పనులను ముమ్మరం చేశారు. మండల పంచాయతీ అధికారి ఎస్.భూపాల్‌రెడ్డి గ్రామంలో పర్యటించి అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలు, మురుగు కాలువల్లో గ్రామపంచాయితీ సిబ్బందితో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. వీధుల వెంట పెంట దిబ్బలు, చెత్తకుప్పలు పోసిన వారికి నోటీసులు అందించారు. ఆయన వెంట పంచాయతీ అధికారి అబ్బగాని సతీష్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

కార్యదర్శి నిర్లక్ష్యంతో..



తాడువాయిలో పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంతో పారిశుద్ధ్యం లోపించింది. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి భాస్కర్ ఇంతవరకు గ్రామం వంక చూడలేదు. వీధుల్లో చెత్తచెదారంతో పాటు మురుగునీరు వచ్చి చేరుతుండడంతో దోమల వ్యాప్తి పెరిగి విషజ్వరాలు ప్రబలుతున్నాయి. వీధుల్లో యుద్ధప్రాతిపదికన శానిటేషన్ చేయాలి.

– కోల ఉపేందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ

జ్వరంతో బాధపడుతున్నా



నేను గత వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నా. దీంతో ప్రస్తుతం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్యం చేయించుకుంటున్నాను. ప్రస్తుతం మా ఇంట్లో మరో ముగ్గురు జ్వరంతో బాధపడుతున్నారు. వైద్యశిబిరంలో చికిత్స బాగానే ఉంది.

– గునగంటి సౌజన్య, తాడువాయి

చికిత్స పొందుతున్నా



గ్రామంలో పారిశుద్ధ్య లోపంతో దోమల వ్యాప్తి ఉధృతంగా మారింది. దీంతో పలువురు విషజ్వరాల బారిన పడ్డారు. నేను రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాను. వైద్యశిబిరంలో రక్తనమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ప్రస్తుతం వైద్యశిబిరంలో చికిత్స చేయించుకుంటున్నా.

– లొడంగి రాకేష్, తాడువాయి

దోమల వ్యాప్తితో జ్వరాలు



పారిశుద్ధ్య లోపంతోనే దోమల వ్యాప్తి పెరిగి పలువురు విషజ్వరాల బారిన పడ్డారు. గత వారం రోజులుగా నీటి నిల్వ ప్రాంతాలు, మురుగు కాలువల్లో దోమల నివారణ మందు చల్లించాం. జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు రేపాల పీహెచ్‌సీ సిబ్బంది సహకారంతో వైద్యశిబిరం ఏర్పాటు చేశాం.

– వైష్ణవి, పల్లెదవాఖానా వైద్యాధికారి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



తెల్లబల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నడిగూడెం : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లక్ష్మీప్రసన్న కోరారు. శనివారం నడిగూడెం మండల పరిధిలోని తెల్లబల్లిలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వలన ఈగలు, దోమల వ్యాప్తితో విష జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. కావున ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ దుర్గాప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ మహేష్, పీహెచ్‌ఎన్ కళావతి, విజయ్‌కుమార్, ఏఎన్‌ఎంలు మంజుల, మంగ, శ్రీదేవి, కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బందిని పెంచాలి

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గత కొంతకాలంగా సరిపడా సిబ్బంది లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సిబ్బందిని పెంచాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ హుజూర్‌నగర్ డివిజన్ కన్వీనర్ వాస పల్లయ్య కోరారు. శనివారం నేరేడుచర్లలోని ఉత్తమ్‌పద్మావతి నగర్‌లో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి విష జ్వరాలు వస్తున్నాయని కావున ఆస్పత్రిలో సిబ్బందిని పెంచి అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ నాయకురాళ్లు సత్తెమ్మ, మౌలాంబి, పావని, లక్ష్మి, రమణ, చెన్నమ్మ, ఫాతిమా, జాన్సీ, రంగయ్య, లక్ష్మయ్య, జానీ, శైలబీ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న వాస పల్లయ్య

బడుగులకు అండగా నిలిచిన మొగిలిచర్ల రంగయ్య



రంగయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నేరేడుచర్ల : బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచి సీపీఎం, సీపీఎం ప్రజా సంఘాల బలోపేతానికి మొగిలిచర్ల రంగయ్య చేసిన కృషి మరువలేనిదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు అన్నారు. శనివారం నేరేడుచర్ల మండల కేంద్రంలోని అరిబండి భవనంలో సీపీఎం నేత మొగిలిచర్ల రంగయ్య 12వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కోదమగుండ్ల నగేష్, సుంకు తిరుపతయ్య, అనగంటి మీనయ్య, నీలా రామ్మూర్తి, ఎడ్ల సైదులు, సట్టు శ్రీను, ఎస్‌కే బనిగి, సతీష్, శ్రీను తదితరులు ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి

సూర్యాపేట : వర్షాలకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటుందని, మున్సిపల్ అధికారులు స్పందించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మున్సిపల్ అధికారులకు సూచించారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్‌లో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను ఆయన పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు తక్షణమే చేయించాలని మున్సిపల్ అధికారులను ఈ సందర్భంగా ఆయన ఫోన్‌లో కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.

బందెలదొడ్డిగా ప్రాథమిక పాఠశాల



పోలేనిగూడెం ప్రాథమిక పాఠశాలలో పశువులు

చిలుకూరు: మండల పరిధిలోని పోలేనిగూడెం ప్రాథమిక పాఠశాల శనివారం బందెలదొడ్డిగా మారింది. వరిసాగు సీజన్ ప్రారంభమై నారుమడులు పోసుకుంటున్న నేపథ్యంలో ఎవరు కూడా పశువులను వదలొద్దని గ్రామపెద్దలు తీర్మానించి గ్రామంలో దండోర వేయించారు. అయినప్పటికీ కొందరు తమ గేదెలను వదలడంతో అవి నారుమడులు నాశనం చేస్తున్నాయి. దీంతో కొందరు రైతులు ఆగ్రహించి తమ నారుమడుల్లో పడిన గేదెలను తోలకొచ్చి పాఠశాల ఆవరణలో ఉంచారు. సెకండ్ శనివారం కావడంతో పాఠశాలకు సెలవు ఉండడంతో అందులో తోలినట్టు స్థానికులు తెలిపారు.

అపరిశుభ్రంగా ఉన్న హోటల్‌కు జరిమానా

సూర్యాపేట : పట్టణంలో పోస్టాఫీస్ ప్రాంతంలోని రాయల్ ఫుడ్ కోర్ట్ పరిసరాలు, లోపల అపరిశుభ్రంగా ఉన్నందున ఫుడ్ కోర్ట్ నిర్వాహకుడు జానిపాషకు మున్సిపల్ అధికారులు శనివారం రూ.5వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలో హోటళ్ల యాజమాన్యాలు తమ హోటళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. మురిగిన, పులిసిపోయిన, నిల్వ ఉంచిన పదార్థాలను వినియోగదారులకు అందిస్తే హోటళ్లను సీజ్ చేయడంతోపాటు భారీ మొత్తంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, బూర సతీష్, హెల్త్ అసిస్టెంట్ మస్కపురం సురేష్, జవాన్లు ములకలపల్లి పరశురాములు, పిడమర్తి ప్రసాద్, దండు ఉపేందర్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్లు లీకేజీ.. వీధులు బురదమయం



బురదమయంగా వీధి

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెం గ్రామ పంచాయతీలోని గాంధీనగర్ కాలనీలో తాగునీటి పైపులైన్లు లీకేజీ కావడంతో వీధులు బురదమయంగా మారాయి. వర్షాపు నీటికి తోడు పైప్‌లైన్ లీకేజీతో వీధుల్లో వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా వీధుల వెంట కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగాయని, వీధిలైట్లు కూడా సక్రమంగా వెలగడం లేదని వెంటనే గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. పల్లయ్య

బియ్యం అందజేత

మోతె : మండల కేంద్రానికి చెందిన మేకల నాగరాజు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. శనివారం బాధితుడికి చాణక్య డిస్టెన్స్ అకాడమీ, శ్రీ శారద ఎడ్యుకేషనల్ సొసైటీల తరఫున కాంగ్రెస్ పార్టీ నాయకులు రూ.25 కేజీల బియ్యం అందజేశారు. దాతలు జిల్లపల్లి లెనిన్, తుర్క వీరస్వామి, మేకల వెంకన్న, మేకల ముత్తయ్య, రావుల ముత్తయ్య, పిడమర్తి సాయికుమార్, కోట నగేష్, మేకల పెంటయ్య, సంజీవ పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీలో దోమల నివారణకు ప్రజలు సహకరించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ అన్నారు. శనివారం రాత్రి హుజూర్‌నగర్ పట్టణంలోని 6, 7 వార్డుల్లో దోమల నివారణకు మున్సిపల్ సిబ్బంది ఫాగింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ పట్టణ ప్రజలు తమ ఇంటి ఆవరణలో నీరు నిలువకుండా చూడాలన్నారు.

మాజీ ప్రజాప్రతినిధులు, టీచర్లకు సన్మానం



సన్మానం పొందిన ఉపాధ్యాయులు, మాజీ ప్రజాప్రతినిధులతో గ్రామపెద్దలు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల నుంచి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులతో పాటు ఇటీవల పదవీకాలం ముగిసిన ప్రజాప్రతినిధులను శనివారం స్థానిక పాఠశాలలో రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు ఓరుగంటి రవి ఆధ్వర్యంలో గ్రామపెద్దలు ఘనంగా సత్కరించారు. అనంతరం జెడ్పీహెచ్‌ఎస్‌కు నూతనంగా బదిలీపై వచ్చిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు దీపాదేవిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.నాగమణి, పి.కుమారి, వై.అంజన్‌రెడ్డి, కె.పద్మ, ఎండీ.సాజిదా బేగం, ఎస్.రామచంద్రయ్య, బి.నరేందర్, ఈ.వి.అరుణకుమారి, పి.రవీందర్‌రెడ్డి, పి.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కొప్పుల వీరమ్మ, మాజీ ఉపసర్పంచ్ ఏనుగుల నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు గడ్డం ఆదిలక్ష్మి, గ్రామపెద్దలు కాలె సామియేలు, బోనాల మంగయ్య, చల్లా గుర్వయ్య, పూర్ణశంకర్, ప్రధానోపాధ్యాయురాళ్లు దీపాదేవి, టి.వినోద పాల్గొన్నారు.

వైభవంగా నారసింహుని నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచు లక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శనివారం వేదమంత్రోచ్చరణాలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతకాలార్చన, నిత్య హోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. విష్వక్సేనారాధన, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణ తంతును పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.



మట్టపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సర్వీస్ రోడ్డు నిర్మించాలని వినతి

కోదాడరూరల్ : ఖమ్మం నుంచి కోదాడ వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి 365ఏ వెంట దుర్గాపురం క్రాస్ రోడ్ నుంచి అల్వాలపురం వరకు సర్వీస్ రోడ్డు నిర్మించాలని పలు గ్రామాల రైతులు శనివారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండిసంజయ్‌లతో పాటు బీజేపీ ఎమ్మెల్యేలకు వినతిపత్రం అందజేశారు. హైవే వెంట సర్వీస్ రోడ్డు నిర్మించకపోవడంతో తమ్మరబండపాలెం, అల్వాలపురం, అశోక్‌నగర్, దుర్గాపురం గ్రామాల రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. వ్యవసాయ పనులకు వెళ్లాలంటే దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరం చుట్టూ తిరిగి రావాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వీస్ రోడ్డు లేక రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉందని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు హరికృష్ణ, కోటి నారాయణ, వేముల దాసు, నాగేశ్వరరావు, కోటయ్య, గోవిందు తదితరులు ఉన్నారు.



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

వర్షాలు కురవాలని కప్పకాముడు

మునగాల : వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని మునగాల మండలంలోని ఈదుల వాగుతండాలో శనివారం పలువురు చిన్నారులు కప్పకాముడు ఆడారు. ఈ సందర్భంగా నడుముకు వేపాకు కట్టుకొని ఓ కర్ర మధ్యలో కప్పను కట్టి ఆట పాటలతో నీళ్ల కుండను నెత్తిన పెట్టుకొని ప్రదర్శనగా వెళ్లి ఊరిచివర ఉన్న బావిలో నీటి కుండను పగులగొట్టారు. నీటికుండ పగలడంతో వర్షాలు బాగా కురుస్తాయనేది నమ్మకమని పలువురు గ్రామపెద్దలు తెలిపారు. కార్యక్రమంలో చిన్నారులు తరుణ్, భూ పాల్, ఈశ్వర్, పరమేష్, విష్ణు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



ఈదులవాగుతండాలో కప్పకాముడు ఆడుతున్న చిన్నారులు

రేపు కంటి వైద్యశిబిరం

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో వరంగల్‌కు చెందిన శరత్ మ్యాక్సీ విజన్ లేజర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాంసుందర్‌రెడ్డి, సుదగాని నాగేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య పరీక్షలకు పెన్షనర్లు, జర్నలిస్టులు తమ హెల్త్‌కార్డులను వెంట తెచ్చుకోవాలని కోరారు.

నాయకుల పరామర్శ

నడిగూడెం : మండలంలోని బృందావపురం గ్రామానికి చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు దొంతగాని శ్రీను ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో శనివారం శ్రీనును ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముత్తినేని సైదేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి బయ్యా నారాయణ, నాయకులు కోడె వాసు, చాపల శ్రీను, కొండా సోమయ్య, పల్లపు నాగేశ్వరరావు, కోదాటి గుర్వయ్య, బూరుగడ్డ థామస్, గుండు నాగేశ్వరరావు పరామర్శించారు.

సమస్యలను పరిష్కరించాలని ఎంపీకి వినతి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు శనివారం హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామం నుంచి లింగమంతులస్వామి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు కాగా ఇటీవల రద్దు చేశారని, వాటిని తిరిగి మంజూరు చేయించి పనులు చేపట్టాలని కోరారు. అలాగే గ్రామంలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని అన్నారు. వ్యవసాయ సబ్‌మార్కెట్‌యార్డులో మిగిలిపోయిన పనులను పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని కోరారు. జెడ్పీహెచ్‌ఎస్‌లో సమస్యలను పరిష్కరించాలని అన్నారు. దీంతో ఎంపీ స్పందించి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బింగి కృష్ణమూర్తి, సుతారపు అనిల్, నోముల నరేష్, గౌని వెంకన్న, నసీర్, శివ, గణేష్, బద్రి, సురేష్ పాల్గొన్నారు.

ఉప కేంద్రం.. నిర్మాణంలో జాప్యం

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నత్తనడకన ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణం
- రెండేళ్లయినా పూర్తికాని పనులు
- త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్న ప్రజలు

కోదాడరూరల్ : మండలంలోని గణపవరంలో ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రెండున్నరేళ్లుగా పనులు పూర్తి కాకుండా నిలిచిపోయాయి. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో పదివేల జనాభాకు ఓ ఆరోగ్య ఉప కేంద్రం ఏర్పాటుకు నాటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కానీ, వైద్య సిబ్బంది గ్రామాల్లో విధులు నిర్వహించేందుకు భవనాలు లేవు. ఉన్న చోట పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో పదివేల జనాభాకు తగినట్లుగా మూడు నాలుగు గ్రామాలకు కూడలిలో ఉన్న మేజర్ గ్రామంలో భవనం నిర్మాణం చేపట్ట తలిచారు. జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ ఫండ్ నుంచి గణపవరంలో భవన నిర్మాణానికి రూ.15 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో 2022 జనవరిలో పనులు ప్రారంభించారు. అయితే పనులు ప్రారంభించిన ఆరు నెలల్లోనే పూర్తి చేసి సిబ్బందికి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. కానీ కాంట్రాక్టర్ మరో వ్యక్తికి సబ్ కాంట్రాక్టర్‌కు ఇవ్వడంతోనే పనులు నిలిచిపోయాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పనులు వెంటనే పూర్తి చేసి నూతన భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.




గణపవరంలో నిర్మాణంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం భవనం

వైద్య సిబ్బందికి ఇబ్బందులు..

ఆరోగ్య ఉప కేంద్రం భవనం లేకపోవడంతో వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. పాత భవనం శిథిలావస్థకు చేరుకున్నప్పటి నుంచి నాలుగేళ్లుగా గ్రామ పంచాయతీ కార్యాలయంలోని ఓ గదిలో వైద్యసేవలను అందిస్తున్నారు. గ్రామ పంచాయతీ పనుల నిమిత్తం వచ్చిన వారికి, వైద్య పరీక్షలు చేయించుకోవడానికి వచ్చిన వారితో అక్కడ ఇబ్బందికర పరిస్థితి నెలకొంటుంది. అదేవిధంగా సిబ్బందికి సంబంధించిన రికార్డులు, మందులు వంటివి కూడా అక్కడే పెడుతున్నారు. తమ భవనం పూర్తి చేసి తమకు కేటాయిస్తే తమకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని వైద్య సిబ్బంది అంటున్నారు.

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



గణపవరంలో నూతనంగా చేపట్టిన ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణపనులను త్వరితగతిన పూర్తిచేయాలి. పనులు పూర్తి చేసి భవనాన్ని ప్రారంభిస్తే వైద్య సిబ్బందికి, ప్రజలకు వైద్యసేవలు అందించడానికి వీలుంటుంది.

– ఇర్ల సీతారాంరెడ్డి, గణపవరం

బిల్లుల ఆలస్యంతో జాప్యం జరుగుతోంది

సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనులు చేయడంలో జాప్యం జరుగుతోంది. ప్లాస్టరింగ్, ఎలక్ట్రికల్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే భవన నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– అనుదీప్, టీజీఎంఎస్ ఐడీసీ ఏఈ, కోదాడ

క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న వార్డెన్ పద్మ

మునగాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గల షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ బాలికల వసతి గృహంలో ఉండే విద్యార్థినులకు ప్రభుత్వం నుంచి వచ్చిన నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, షూస్, చెప్పులను ఇన్‌చార్జ్ వార్డెన్ పద్మ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహంలో ఉంటున్న 76 మంది విద్యార్థినులు స్థానిక జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలతో పాటు మోడల్ స్కూల్‌లో విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న బొబ్బయ్య

హుజూర్‌నగర్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని డీఎస్‌ఆర్ ట్రస్ట్ అధ్యక్షుడు దగ్గుబాటి బాబూరావు అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో ఓ మహిళకు గర్భసంచి ఆపరేషన్ నిమిత్తం బి పాజిటివ్ రక్తం అవసరం కావడంతో డీఎస్‌ఆర్ టస్ట్ సభ్యుడు చక్రాల బొబ్బయ్య రక్తదానం చేశారు.

సాగర్ సిమెంట్స్ ఆధ్వర్యంలో కేన్సర్ నిర్ధారణ శిబిరం



కేన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న పరిశ్రమ అధికారులు

మఠంపల్లి : మండల కేంద్రంలోని మౌంట్ ఫోర్ట్ హైస్కూల్‌లో శనివారం స్థానిక సాగర్ సిమెంట్స్ పరిశ్రమ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బసవతారక ఇండో అమెరికన్ కేన్సర్ నిర్ధారణ కేంద్రం వారిచే ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ రమణమూర్తి ప్రారంభించారు. సుమారు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.1 లక్షా 50 వేల విలువ గల మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం డాక్టర్ రవిశంకర్, డాక్టర్ శ్రావణకుమారి, డాక్టర్ సులోచన, డాక్టర్ హరీష్, డాక్టర్ సదాశివరెడ్డి, పరిశ్రమ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా రామారావు



కోదాడరూరల్ : బహుజన సమాజ్ వాది పార్టీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పట్టణానికి చెందిన సాలే రామారావు నియమితులయ్యారు. శనివారం కోదాడ పట్టణంలో జరిగిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పగిడిమర్రి బాబురావు ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి స్టాలిన్ అంబేడ్కర్ రామారావును నియమించి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు చింతల రమేష్, కాంపాటి వీరస్వామి, షేక్ హుస్సేన్, శ్రీనివాసచారి, అంజిరెడ్డి, దుర్గారెడ్డి, నాగేశ్వరరావు, నాగ, సక్రు ఉన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల నూతన కమిటీ ఎన్నిక



నూతన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న నాయకులు, కార్మికులు

మఠంపల్లి : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల సమావేశం ఆ యూనియన్ మాజీ మండల అధ్యక్షుడు ఇంటి రవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భూక్యా సైదానాయక్, ఉపాధ్యక్షుడిగా మామిడి అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా బత్తుల వీరస్వామి, సహాయ కార్యదర్శిగా అబ్దుల్ రహీం, కోశాధికారిగా రూపావత్ భిక్షం, గౌరవ సలహాదారుడిగా రాయిరాల బాలశౌరి, కార్యవర్గ సభ్యులుగా సంతోషం, కోటేశ్వరి, నాగలక్ష్మి, దుర్గాబాయి, విమల, నాగయ్య, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, నరేష్, పాండు, లక్ష్మిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ప్రధాన కార్యదర్శి మంగళపల్లి మైసయ్య, ఉపాధ్యక్షుడు ధరావత్ మోతీలాల్, దేవదానం, కుమారి, విజయ, తదితరులు పాల్గొన్నారు.